# నేహాల



సాయిబ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

## 22

**మల్లప్పకి ఫిరోజ్‌షా స్థావరం నుండి ఏ కబురూ అందలేదు.** యుద్ధానికి సైన్యాన్ని సిద్ధం చేస్తున్నాడు. ప్రజలందర్నీ అప్రమత్తంగా ఉండమని ఆదేశాలు జారీ చేసాడు. భారీగా సైన్యాన్ని అన్ని దిక్కులా పంపించాడు. ముఖ్యంగా గంగావతి వద్ద సుల్తాన్ సైన్యం ఆక్రమించుకున్న ఊరు దగ్గరగా మరింత సైన్యాన్ని మోహరించాడు. సుల్తాన్ స్థావరాన్ని అష్టదిక్బంధం చేసి మట్టుపెట్టాలన్న - ఆలోచన వుంది. దేవరాయల్ని కనక వారు చంపితే, యుద్ధం తప్ప శరణ్యం లేదు. ఒకవేళ దేవరాయల్ని అడ్డుగా పెట్టుకొని ఫిరోజ్‌షా ఎలా పావులు ముందుకు కదుపుతాడో అర్థం కాని పరిస్థితి ఎదురయ్యింది. ఏదేమయినా ప్రస్తుతం సహనంగా ఉండాలి.

దౌత్యం ద్వారా చర్చలు చేస్తూనే, మరో పక్క యుద్ధానికి సైన్యాన్ని సిద్ధం చెయ్యాలి.

దేవరాయల సైన్యం చాలా పెద్దది. కొన్ని వేలమంది సైన్యాన్ని ఉత్తరంవైపుగా రాయచూరు సమీపానికి పంపించాడు. రహదారులన్నీ సైనికులతో నిండిపోయాయి. సైన్యానికి కావల్సిన ఏర్పాట్లనీ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నాడు. దేవరాయలు బందీగా విడుదలయ్యే వరకూ అతనికి మనస్థిమితం లేదు. ఒకవేళ దేవరాయలు మరణిస్తే తదనంతరం ఎవరన్నది రాజకూటమిలో జరుగుతున్న ప్రధాన చర్చ. అంతా సవ్యంగా జరుగుతుందనే నమ్మకంతో ఉన్నాడు.

ఒకవేళ కూడనిది జరిగితే దేవరాయల కొడుకు రామచంద్ర రాయలే విజయనగరాన్ని పాలించడానికి అర్హుడు. కానీ అతనూ వయసులో చిన్నవాడే అంతగా పరిపాలనానుభవం లేదు. దేవరాయలు కూడా మొదటి భార్య కుటుంబాన్ని రాజ్య వ్యవహారాలకి దూరంగానే ఉంచాడు. రామచంద్ర రాయలుకి ఇంకా వయసు రాలేదనో లేక తనకింకా వయసు మీరలేదనో ఎవరికీ తెలీదు. దేవరాయల అన్నదమ్ముల బంధువులెవరూ రాజ్య పరిపాలనా వ్యవస్థలో లేరు. దేవరాయలు తన సొంత వాళ్ళని తుదముట్టించే గద్దెనెక్కాడన్నది అందరికీ తెలుసు. ఇంతవరకూ ఒంటి చేత్తో రాజ్యాన్ని శాసించిన దేవరాయలకి ఎన్నడూ అడ్డు రాలేదు. తను సింహాసనం ఎక్కాకా పరిపాలనా పరంగా ప్రజలకి అంతా మంచే చేసాడు. పంటకాలవలు తవ్వించడం, సైన్యంలోకి ప్రజలని తీసుకొని వారికి జీవనోపాధి కల్పించడం వంటివి బాగానే చేసాడు. ఇవన్నీ చూసే అతనెలా గద్దె ఎక్కాడన్నది ప్రజలు పట్టించుకోలేదు. అతి తక్కువకాలంలోనే మంచి పేరు తెచ్చుకున్నాడు.

దేవరాయలు లేని విజయనగరాన్ని ఇప్పటివరకూ ఎవరూ ఊహించలేదు. రాజకుటుంబాల నుండీ ఒత్తిడి పెరుగుతోంది. రామచంద్ర రాయలని దేవరాయల మందిరానికి పిలిపించాడు మల్లప్ప. జరిగినదీ, జరుగుతున్నదీ వివరించాడు. అనుకోనిది జరిగితే అతనే రాజ్యాధికారాన్ని తీసుకోవాలనీ, అతని వెనుక తానూ, మిగతా అధికారులూ వెన్నంటి ఉంటామని చెప్పాడు. దేవరాయల్ని బ్రతికించుకోవడమే తమ ప్రధాన కర్తవ్యమనీ చెప్పాడు. అయినా సుల్తానులు ఎలా ప్రవర్తిస్తాతో చెప్పలేమనీ హెచ్చరించాడు. ఈ విధంగా మల్లప్ప తన ప్రయత్నాలు తను చేస్తున్నాడు. దేవరాయల మొదటి భార్య సంతానాన్ని రాజమందిరానికి రప్పించినా, ఉమాదేవినీ, ఆవిడ తమ్ముణ్ణీ మాత్రం ఆ దరిదాపులక్కూడా రానీయలేదు. తన వ్యూహమేవిటో ఎవరికీ చెప్పలేదు. దేవరాయలు బ్రతికి తిరిగొస్తే మంచిదే!

రాకపోతే గుల్బర్గా సుల్తానులపై దాడి చెయ్యడం, గంగావతి వద్దే వారిని తుదముట్టించాలన్నది అతని ఆలోచన. ఇవన్నీ బయటకి పొక్కకుండా జాగ్రత్త పడ్డాడు.

ఫిరోజ్‌షా నుండి ఎంతకీ కబురు రాకపోయేసరికి మరోసారి తన దూతని పంపించాడు.

0000000000

రాయచూరు మొత్తం తురక సైన్యంతో నిండిపోయింది. ఊరు పొలిమేరల్లో మాత్రం మల్లప్ప పంపిన సైన్యం బారులు తీరి వుంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయపడిపోతున్నారు. నిన్ననగా వెళ్ళిన మసూం ఎప్పటికీ ఇంటికి రాకపోయేసరికి హరీంద్రకీ, నేహలకీ దిగులు పట్టుకుంది. రేవన్న ధైర్యంగా ఉండమని చెబుతున్నా వినే పరిస్థితుల్లో లేరు. ఆసరాగా ఉన్న మసూం కూడా ఇబ్బందుల్లో చిక్కుంటే ఎక్కడికని వెళ్ళేది? ఇదే దిగులు హరీంద్రని వేధిస్తూంటే అది కూతురికీ అంటించాడు. పొద్దుట నుండీ నేహల ముభావంగా ఉంది. ఎవరితోనూ మాటా మంతీ లేదు. రేవన్నతోనూ అదే తీరు.

"ఏం? వంట్లో నలతగా ఉందా?" ఉండబట్టలేక ప్రశ్నించాడు.

"లేదు. మసూం నిన్ననగా వెళ్ళాడు. ఇంకా రాలేదేవిటి? ఓ సారి కోట గుమ్మం వరకూ వెళ్ళి చూసొస్తావా?" నేహల మాటల్లో ఆమె దిగులు స్పష్టంగా వినిపించింది.

"అలాగే! నిన్న వెళ్ళొచ్చాను. రాయచూరు గుల్బర్గా సైనికుల చేతిలో ఉంది. ఊరు పొలిమేరల్లో విజయనగరం సైన్యం ఉందని అందరూ అంటున్నారు. ఫిరోజ్‌షా గంగావతి వరకూ వెళ్ళారని అన్నారు. మరి ఈ విజయనగర సైన్యం ఏవిటో అస్సలు అర్థం కావడం లేదు. నేనూ మసూం కోసమే ఎదురుచూస్తున్నాను. బహుశా గుల్బర్గ వెళ్ళాడేమో?" రేవన్న నిన్న రాత్రి చెప్పిందే మరలా చెప్పాడు.

"ఎక్కడకెళ్ళేదీ చెప్పకపోయినా ఎప్పుడొస్తాడో మాత్రం చెబుతాడు తను. ఇప్పుడే వస్తానని వెళ్ళిన మనిషి ఇంతవరకూ రాలేదు. అసలే ఈ సైన్యమూ, యుద్ధాలూ... నిజం చెప్పద్దూ, నాకంటే మా అమ్మా,నాన్న లోలోపల చాలా మధన పడుతున్నారు," అంది నేహల.

"నేనూ గ్రహించాను. కానీ ఏం చెయ్యగలం చెప్పు? యుద్ధాలు మన చేతుల్లో ఉన్నాయా చెప్పు?"

"మన బ్రతుకే మన చేతుల్లో లేకుండా పోయింది! పోనీ, కష్టమో నష్టమో మన ఊరెళ్ళి పోదామా? పుట్టి బుధ్ధెరిగాక ఇంతకాలం ఇల్లు వదిలి ఉండ లేదు. ఎలా వుందో ఏవిటో?" చెబుతూంటే నేహల కంట నీరు గమనించాడు రేవన్న.

ఏం చెప్పాలో తెలియ లేదు. చెప్పడానికి అతని దగ్గరా ఏ సమాధానమూ లేదు. మౌనంగా ఉండిపోయాడు. కొంతసేపయ్యాక తనే అన్నాడు.

"ఏం ఇంటి మీద బెంగ వచ్చిందా?"

"నా బెంగల్లా మా వాళ్ళ గురించే! నా వల్ల వాళ్ళూ ఇబ్బందులు పడుతున్నారు. అయినా ఒక్కసారి అశ్వత్థ నారాయణ స్వామి గుడికెళ్ళాలనిపించింది. ఒక్కనాడు కూడా ఆలయానికి వెళ్ళకుండా లేను. ఎన్నాళ్ళిలా గడపాలా? అన్నదే నా బాధ," నేహల కంటికింద నీటి చుక్కలు తుడుచుకుంటూ అంది.

"అర్థం చేసుకోగలను. కానీ.." అంటూ ఒక్కసారి నేహల కేసి చూస్తూ ఆగిపోయాడు. ఆమె ఏమీ మాట్లడలేకపోయేసరికి తిరిగి అతనే అన్నాడు. "ఇంతకాలం ఎలాగూ ఓపిక పట్టాం. ఈ యుద్ధం వస్తే అదీ మనకు మంచిదే! అందరూ వాళ్ళ గొడవలో వాళ్ళుంటారు. ముఖ్యంగా రాజులు. హాయిగా మనం ముద్గల్ వెళ్ళి గడపచ్చు...ఇంకెంత? కొన్నాళ్ళు సర్దుకుంటే.."

"ఆ కొన్నాళ్ళు ఇంకా ఎన్నాళ్ళాన్నదే నా ప్రశ్న. ఒక్కోసారి అమ్మా, నాన్నని చూస్తే గుండె తరుక్కుపోతోంది.

కన్న పాపానికి వాళ్ళిలా మథన పడుతున్నారు కదా? అనిపిస్తుంది. అయినా మన చేతుల్లో ఏవీ లేదని తెలుసు," నిర్లిప్తంగా అంది నేహల.

రేవన్న తలెత్తి ఆమె కేసి చూసాడు. మునపటి కళ లేదు. కళ్ళకింద గుంటలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అతనికీ అన్నీ తెలుసు. కానీ ఏవీ చెయ్యలేని పరిస్థితి.

ఇంతలో వీధి తలుపు చప్పుడయితే అటుగా వెళ్ళారిద్దరూ. అప్పటికే హరీంద్ర వెళ్ళి తలుపుకున్న చిన్న కంతలోంచి ఎవరొచ్చారాని చూసి, తలుపు తీసాడు. వచ్చింది మసూం.

అతన్ని చూడగానే నేహల కళ్ళల్లో సంతోషం కనిపించింది.

"హమ్మయ్యా, వచ్చావా? ఇంకా రాలేదేవిటాని భయపడి పోతున్నాను," నేహలే అంది.

"నేను పని మీద గుల్బర్గా వెళ్ళాల్సి వచ్చింది. నిన్న కోట గుమ్మం వద్దకి వెళ్ళినపుడు తక్షణమే రమ్మనమన్నారంటూ గుల్బర్గా సుల్తానుల నుండి కబురొస్తే వెళ్ళాను. రాత్రికి వచ్చేయచ్చుకదా అని అనుకున్నాను. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో రాత్రి ప్రయాణం మంచిది కాదని తెల్లారాక బయల్దేరాను. అంతే," వరండా దగ్గర కాళ్ళు కడుక్కుంటూ అన్నాడు మసూం.

"నిన్నటి సాయంత్రం నుండీ నీకోసమే కలవరిస్తోంది నేహల. వచ్చావు కదా! మాకు కాస్త మనశ్శాంతి," నవ్వుతూ అన్నాడు రేవన్న.

"గుల్బర్గా సైనికులకీ, విజయనగరం రాజులకీ మధ్య ఈ సారి పెద్ద యుద్ధమే జరిగేలా ఉంది. సుల్తాన్ ఫిరోజ్‌షా యుద్ధంలో తీవ్రంగా గాయపడి గంగావతి దగ్గర చిక్కుకుపోయాడట. వాళ్ళని దేవరాయల సైన్యం చుట్టుముట్టిందని విన్నాను. వారం క్రితం గిసుదరాజ్ మౌల్వీ సుల్తాన్ని పరామర్శించడానికి మారువేషంలో వెళ్ళారట. ఎలాగయినా యుద్ధం తప్పించడానికే వెళ్ళారని విన్నాను. అన్నింటికంటే నమ్మశక్యం కాని విషయం ఏవిటంటే దేవరాయులు సుల్తాన్ చేతిలో బందీగా చిక్కాడని. కొంతమంది అది పుకారని అంటున్నారు. కాదని ఇంకొంతమంది చెప్పారు. ఎవరికీ ఏం జరుగుతూందో తెలియడం లేదు," తనకి తెలుసున్న సమాచారం చెప్పాడు మసూం.

దేవరాయలు బందీ అనేసరికి అందరూ ఆశ్చర్యపోయారు.

ఎవరికీ విషయం పూర్తిగా అర్థం కాలేదు. అంతా గందరగోళంగా అనిపించింది. రేవన్న అప్పుడు నేహల తనతో చెప్పిన మాటలు కొన్ని పైకన్నాడు.

"ప్రస్తుతం మీరు కదలడం ఎవరికీ మంచిది కాదు. కొన్నాళ్ళు ఓపిక పడితే అన్నీ అవే సర్దుకుంటాయి," అని మాత్రం అన్నాడు మసూం.

ఇక ఆ సంభాషణ ఎవరూ పొడిగించలేదు. భోజనం చేసి నడుం వాల్చాడు మసూం.

00000000000

గిసుదరాజు వచ్చాక ఫిరోజ్‌షాకి కాస్త ధైర్యం వచ్చింది. కానీ తనకి తగిలిన గాయాల బాధమాత్రం భరించరానిదిగా తయారయ్యింది. మంచానికే పరిమితమయ్యాడు. సైనికులు సేవ చేస్తున్నా ఇంకా కోలుకోవడానికి చాలా సమయం పడుతుందని అతనికి అనిపించింది. ఏదైనా అత్యవసరమయితే తప్ప ఎవరూ అతన్ని సంప్రదించడం లేదు. పూర్తి విశ్రాంతి అవసరమని ఫరూక్ మొత్తం వ్యవహారాలన్నీ తనే చూసుకుంటున్నాడు. గిసుదరాజు వచ్చాక ప్రతీ విషయం అతనితో సంప్రదిస్తున్నాడు. గిసుదరాజు వచ్చినట్లుగా దేవరాయలకి తెలియనివ్వకుండా జాగ్రత్త పడ్డాడు ఫరూక్. దేవరాయల దూత ఒకతను వచ్చినా ఏమీ చెప్పకుండానే వెనక్కి పంపించేసాడు. ప్రతుతం ఈ పరిస్థితి ఎంత సాగదీస్తే అంత మంచిది.

గిసుదరాజు మాత్రం యుద్ధం ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకుండా చూడాలని ఒకటికి పదిమార్లు హెచ్చరించాడు. దేవరాయల కూతుర్ని వివాహమాడడానికి సంసిద్ధత వ్యక్తం చేసినా, ప్రస్తుతం లేచి తిరిగే పరిస్థితుల్లో లేడు ఫిరోజ్‌షా. ప్రతిపాదన సరేనన్నా, కనీసం లేచి తిరగాలి కదా? ఇంకో నాలుగు దినాలు ఆగితే ఫిరోజ్‌షా కోలుకుంటాడన్నది వాళ్ళ ఆశ. అందుకే ఏదైనా సందేశం ఉంటే మేమే కబురంపుతామని చెప్పి మల్లప్ప పంపిన దూతని పంపించేసారు.

దేవరాయల్ని కలిసి మాట్లాడాలని గిసుదరాజు ఫరూక్కి చెప్పాడు. సంకెళ్ళతో బంధించిన దేవరాయల్ని తీసుకొచ్చారు. అతనికి సంకెళ్ళు విప్పమని ఆదేశించాడు గిసుదరాజ్. అక్కడే ఉన్న ఒక పరుపు మీద కూర్చోమని చెయ్యి చూపించాడు. దేవరాయలు చూసాడు కానీ కదల్లేదు. అలాగే నిలబడి ఉన్నాడు. అతనికి ఈ కొత్త వ్యక్తి ఎవరో తెలియ లేదు. మంత్రి అయ్యుంటాడనీ అనుకున్నాడు. ఫిరోజ్‌షా మాత్రం కనిపించలేదు. బహుశా అతన్ని రాయచూరు తీసుకెళ్ళారా అనుకున్నాడు.

పెరిగిన గెడ్డంతో, మాసిన దుస్తులతో దేవరాయల మొహంలో కళ తప్పింది. తనని తాను పరిచయం చేసుకున్నాక గిసుదరాజు సూటిగా విషయంలోకి వచ్చేసాడు.

"జరిగిందేదో జరిగింది. మీరు చేసిన ప్రతిపాదన మా సుల్తాన్‌కి అంగీకారమే! కానీ కొన్ని షరతులు. మీ రాజ వైద్యుల్ని ఇక్కడికి పంపించి సుల్తాన్‌కి చికిత్స చేయించాలి. ఆయన కోలుకున్నాక మనం శాంతి ఒడంబడిక చేసుకుందాం. మీ అమ్మాయికి కట్నంగా మాకు రాయచూరు ఇవ్వాలి. మిమ్మల్ని విడిపించినందుకు నజరానాగా మాకు పదివేల మొహరీలు, బంగారు కానుకలూ, వజ్ర వైఢూర్యాలూ ఇవ్వాలి. అలాగే రెండు రాజ్యాల మధ్య సంధి ఒప్పందం కింద మీరు తామంతట తాముగా యుద్ధాలు చెయ్యకూడదని ఒప్పుకోవాలి. అలాగే ఇరు రాజ్యాల మధ్యా రాకపోకలు పెంచి శాంతి నెలకొల్పాలి," అంటూ చెప్పాడు.

గిసుదరాజు మాటల్ని అక్కదే ఉన్న ఒక దుబాసీ తర్జుమా చేసి చెప్పాడు. వాళ్ళిద్దరిదీ విచిత్రమయిన స్థితి. ఒకరి భాష ఒకరికి రాదు. అయినా మాట్లాడక తప్పదు.

దేవరాయలు అన్నీ విన్నాడే తప్ప ఏమీ మాట్లాడ లేదు.

ఏం సమాధానమూ రాకపోయేసరికి అతని మొహంలోకి తీక్షణంగా చూసాడు గిసుదరాజ్.

"ఏవిటి? మీకు మా మాట మీద నమ్మకం లేదా?" ఎదురు ప్రశ్న వేసాడు గిసుదరాజ్.

కాదన్నట్లు తలూపాడు దేవరాయలు.

"మాట తప్పడం విజయనగర రాజవంశంలోనే లేదు. మీరు చెప్పినవన్నీ సమ్మతమే  కానీ, అన్ని షరతులూ, మాకేనా? మీకేవీ వర్తించవా?"

"సంధి అన్నది ఇద్దరి మధ్యా కాబట్టి అవి అందరికీ వర్తిస్తాయి. నాకున్న లక్ష్యం ఒకటే. యుద్ధాలు లేని ప్రశాంత జీవితం మీరిద్దరూ ప్రజలకివ్వండి చాలు. ఇప్పటికే ఇరు రాజ్యాలూ ఎంతో నష్టపోయాయి. ఇహముందు అలాంటివి జరగకుండా ఉండాలనే ఇవన్నీ చెప్పాను. మీ అమ్మాయినిచ్చి సుల్తాన్ని అల్లుడిగా చేసుకోవడమన్న మీ పెద్ద మనసుకి నమస్కరిస్తున్నాను. ఈ రకంగానయినా ఇరు

రాజ్యాలూ సహృదయంతో కలిసి మెలిసి ఉంటాయని అనుకుంటున్నాను. మీకు ఇవన్నీ సమ్మతమయితే చెప్పండి. మా దూత ద్వారా మీవాళ్ళకి తెలియ చేయిస్తాం," అంటూ చెప్పాడు.

దేవరాయలకి ఎలాగయినా ఈ రొంపినుండి బయట పడాలనే ఉంది. కానీ తన వాళ్ళు ఏం చేస్తున్నారూ, అసలు వీళ్ళందరూ ఇక్కడే ఎందుకు వున్నారు? ఇలాంటి ప్రశ్నలు అతన్ని వేధిస్తున్నా, ఒకటి మాత్రం అతనికి తెలిసింది. అదేవిటంటే విజయనగరం వీరి చేతుల్లోకి చిక్కలేదు. అందుకే తన షరతులకి సరేనని అంటున్నారని అర్థమయ్యింది. తన కూతుర్నిచ్చి వివాహం చేస్తానంటే ఒప్పుకోవడానికిదే కారణం అయ్యుంటుంది. వీళ్ళకీ ఏదో తెలియని ఇబ్బంది వచ్చి ఉంటుంది. అందుకే తనతో రాజీకి వస్తున్నారు. గిసుదరాజుని చూస్తే నిజాయితీ పరుడిలాగే కనిపించాడు. మాటల్లో ఎక్కడ పరుష వాక్యం లేదు. ఎంతో సంయమనంతో మాట్లాడుతున్నాడు.

"మా వాళ్ళకి కబురుపంపి నా మాటగా చెప్పండి. ఈ సంధికి నేను ఒప్పుకుంటున్నాను. నా కూతురు మంజరినిచ్చి సుల్తాన్‌కి వివాహం చేసుకుని చుట్టరికం కలుపుకుందాం. ఈలోగా మీకు ఆనెగొంది కోటలో నివాసం ఏర్పాట్లు చేయిస్తాను. మీ సుల్తానుకి వైద్య సదుపాయాలు సంకూరుస్తాను. ముందు నన్ను విడిపించండి," అని చెప్పాడు దేవరాయలు.

"అలాగే! మీ వాళ్ళని ముందు పిలిచి అన్ని ఒడంబడికలూ లిఖిత పూర్వకంగా చేసుకున్నాక మిమ్మల్ని విడుదల చేస్తాము. మీకు తక్షణమే ఈ సంకెళ్ళనుండి విడుదల చేయమని చెబుతాను. ఈ క్షణం నుండి మిమ్మల్ని మావాళ్ళెవరూ బాధించరు. అన్నీ సద్దుమణిగే వరకూ మాత్రం మీ చుట్టూ కాపలా వుంటుంది. మీరు పారిపోతారని కాదు; ఇవన్నీ మీకు తెలియనివి కావు," అంటూ చెప్పాడు గిసుదరాజ్.

కొన్ని నిమిషాల తరువాత దేవరాయల్ని అక్కడనుండి తీసుకెళ్ళారు సైనికులు. దేవరాయలకి చచ్చేటంత ఇబ్బందిగా ఉంది. భాష రాదు. ఎవరిదీ ఒక్క మాటా అర్థమయ్యి చావదు. అక్కడక్కడ వాళ్ళ ముఖ కదలికలు బట్టి అన్నీ గ్రహించాల్సి వస్తోంది.

దేవరాయలతో లోపాయకారి సంధి కుదుర్చుకున్నా ఫిరోజ్‌షా కోలుకున్న రెండునాళ్ళ తరువాత మల్లప్పకి కబురంపారు, మాటలకి రమ్మనమని. మల్లప్ప వారినే తమ మందిరానికి రమ్మనమని హ్వానించాడు. ఎవరు ఎవర్నీ నమ్మరు. కానీ చర్చలు జరగాలి. అదేం కుదరదు, తమ స్థావరంలోనే మాట్లాడుకుందాం రమ్మనమని చెప్పారు. ఇహ తప్పక సరే నన్నాడు మల్లప్ప. తనతో పాటు సైనికాధికారులనీ, ముఖ్యమైన రాజ్యాధికారులనీ వెంటబెట్టుకొని వెళ్ళడానికి సిద్ధమయ్యాడు.

ఇంత జరుగుతున్నా అతనికి దేవరాయలు ఎలా వున్నాడో మాత్రం తెలియలేదు. అసలు వాళ్ళు చంపకుండా ఎందుకు ఊరుకున్నారో అర్థం కాలేడు. లేక యుద్ధంలో తీవ్రంగా గాయపడ్డాడా అన్న విషయం కూడా బయటకి పొక్కకుండా జాగ్రత్త పడ్డారు వాళ్ళనిపించింది. చర్చలకి వెళితే అసలు విషయాలు బయటకొస్తాయి కదా అనుకున్నాడు. తనెప్పుడు వచ్చేదీ, ఎంతమంది వచ్చేదీ కబురంపాడు.

మంచి ముహూర్తం చూసుకొని ఫలానా సమయానికి వస్తామని తెలిపాడు.

ఆ సమయం రానే వచ్చింది. తనవాళ్ళతో కలిసి బయల్దేరాడు. గంగావతి దాటిన కొద్ది దూరంలోనే సుల్తానుల స్థావరం కనిపించింది. దేవరాయల తాలూకు అధికారులని వాళ్ళ వేషధారణా, రథమూ, గుర్రాలూ చూస్తేనే అర్థమయ్యిది. వీళ్ళని గిసుదరాజ్ ఎదురెళ్ళి హ్వానించాడు. ఫరూక్ మాత్రం రాలేదు. ఈ మొత్తం చర్చల్లో ఎక్కడా ఫిరోజ్‌షాకి తెలియకుండానే జరపాలన్నది గిసుదరాజ్ నిర్ణయం.

తమతో తెచ్చుకున్న దుబాసీకి వాళ్ళు చెప్పేది యధాతథం అనువాదం చేసి చెప్పాలని ఆదేశించాడు గిసుదరాజ్.

ముందు ఒకరినొకరు పరిచయాలయ్యాక, మల్లప్పే తెలివిగా దేవరాయల గురించి అడిగాడు.

"మా మహారాజుని ఒక్క సారి కలవడం కుదురుతుందా?"

"ముందు చర్చలు కానీయండి. తరువాత మీరు మీ మహారాజుని తప్పక కలవవచ్చు," గిసుదరాజ్ చెప్పాడు. అతని సమాధానం విన్నాక అక్కడున్న విజయనగర అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

దేవరాయలు బ్రతికే ఉన్నాడన్న సూచన మల్లప్పకి మరింత ధైర్యాన్నిచ్చింది.

దేవరాయల ప్రతిపాదనని ముందుగా చెప్పి, దానికి తమ సుల్తాన్ అంగీకారమేనని చెప్పాడు. అక్కడ సుల్తాన్ ఫిరోజ్‌షా కనిపించకపోయేసరికి అనుమానమొచ్చింది మల్లప్పకి.

"ఒక్క సారి మా మహారాజుని కలిసి తెలుసుకోవచ్చా?" మల్లప్ప అడిగాడు. కొంతసేపటికి దేవరాయల్ని తీసుకొచ్చారు. గత నాలుగు వారాలుగా సరైన తిండీ, నిద్రా లేక పీక్కుపోయిన మొహంతో కనిపించాడు దేవరాయలు. వస్తూనే మల్లప్పకేసి చూసి బావున్నారా అన్నట్లు కళ్ళతోనే పలకరించాడు. దేవరాయలు తన ప్రతిపాదన తన వాళ్ళకి చెప్పాడు. అందరూ అంగీకరించాక ఒప్పందం కుదుర్చుకున్నారు.

అదేవిటంటే - దేవరాయలు కూతురు మంజరిని ఫిరోజ్‌షాతో పెళ్ళి చెయ్యడం; కట్నకానుకగా రాయచూరు వదులుకోవడం; ముందు ముందు రెండు రాజ్యాలూ శాంతిగా ఉండడం; పాతిక వేల మొహరీల విలువగల సొమ్మూ, బంగారమూ చెల్లించడం; ఈ నిఖా జరిగే వరకూ ఫిరోజ్‌షాకి విడిది ఏర్పాట్లు చెయ్యడం; వీటన్నింటికీ బదులుగా దేవరాయల్ని తమ రాజ్యానికి విడిపించడం.

గత్యంతరంలేక అన్నింటికీ ఒప్పేసుకున్నారు దేవరాయల అనుచరగణం. ఫిరోజ్‌షాకి ఆనెగొంది కోటలో ఏర్పాట్లు చేయిస్తానని చెప్పాడు దేవరాయలు. అలాగే ఫిరోజ్‌షా కోలుకున్న తరువాతే ఈ నిఖా ఏర్పాటు చేసుకుందామని అనుకున్నారు. సుల్తానుకి తక్షణమే ఆస్థాన వైద్యులతో చికిత్స చేయిస్తానని చెప్పాడు.

ఇద్దరి మధ్యా చర్చలు పూర్తయ్యాక చివర్లో ఒక్కసారి సుల్తాన్ ఫిరోజ్‌షా ఉన్న గుడారం వద్దకెళ్ళి జరిగినదంతా చెప్పాడు గిసుదరాజ్. దేవరాయలు కూడా వెళ్ళి సంధి కరచాలనం చేసాడు.

తమ సైన్యం గుల్బర్గా తిరిగి వెళ్ళడానికి దారులు సుగమం చెయ్యాలని గిసుదరాజ్ కోరాడు. ఒక వారంలోగా ఏర్పాట్లు చెయిస్తాననీ అంతవరకూ సైన్యానికి కావల్సిన ఆహారమూ, సౌకర్యాలూ ఏర్పాట్లు చేయిస్తాననీ చెప్పాడు దేవరాయలు.

రాయచూరు పోతే పోయింది, మహారాజు తిరిగొచ్చాడని సంతోషించారు మల్లపా, మిగతా అధికారులూ.

ఆ మధ్యాన్నం దేవరాయల్ని తమ మందిరానికి వెళ్ళడానికి అనుమతించాడు గిసుదరాజు.

సుల్తాన్ చేతుల్లో మరణించడం ఖాయం అనుకున్నాడు దేవరాయలు. తిరిగి విజయనగరం చేరుకుంటానన్న ఆశయితే ఎప్పుడూ కలగలేదు. ఇంత జరిగినా అసలు సుల్తాన్ యుద్ధం చెయ్యడానికి ఇంత దూరం ఎందుకొచ్చాడన్నది అతనికి అర్థం కాలేదు. అసలెలా రాగలిగాడు? తమ వేగులేం చేస్తున్నారు? రాయచూరు వద్ద తమ సైన్యం వీళ్ళని ప్రతిఘటించలేదా? ఇవన్నీ అతనికి జవాబు లేని ప్రశ్నలు.

తన మందిరానికి తిరిగి వెళుతూండగా - "మహారాజా, మీ అమ్మాయి మంజరిని సుల్తాన్‌కిచ్చి పెళ్ళి చేయమని వాళ్ళే కోరారా?" అడిగాడు మల్లప్ప. అది తన ప్రతిపాదనేననీ, ఎంతో ఆలోచించాకే అది చేసానని చెప్పాడు.

చూస్తూ చూస్తూ శత్రువుకి సొంత పిల్లనివ్వరు. తనక్కడనుండి తప్పించుకోవడానికదొక్కటే మార్గం కనిపించిందని చెప్పాడు. దేవరాయలు బ్రతికే ఉన్నాడనీ, యుద్ధం లేదనీ, ఇరు రాజ్యాల నడుమా శాంతి ఒప్పందం కుదిరిందన్న వార్త విజయనగరమంతా పాకింది. అందరూ ఆనందోత్సవాలతో పండగ జరుపుకున్నారు. దేవరాయలు మాత్రం గండం గడిచిందని ఊపిరి పీల్చుకున్నాడు.

00000000000

తన నివాసానికెళ్ళి స్నానం చేసి ముగ్గురు భార్యలతో కలిసి విరూపాక్ష దేవాలయానికెళ్ళాడు దేవరాయలు. సాధారణంగా ముగ్గురు భార్యలతో మహారాజు వెళ్ళడం చాలా అరుదుగా చూస్తారు ప్రజలు.

వెళ్ళగానే తమ ఒప్పందం ప్రకారం వైద్యుణ్ణి పంపించాడు దేవరాయలు. అలాగే సుల్తాన్ కోసం హార సౌకర్యాలకి ఏర్పాట్లు చేయించాడు. రాచ మర్యాదలతో వారిని చూడాలని ఆదేశించాడు. ఫిరోజ్‌షాకోసం ఆనెగొంది కోటని విడిదిగా ఇప్పించాడు. ఇవన్నీ వాళ్ళకి నమ్మకం కలిగించడం కోసం చేసాడు.

తన కూతుర్ని సుల్తానుకిచ్చి వివాహం జరిపించడానికి నిశ్చయించానని మొదటి భార్యకి ముందుగా చెప్పాడు. అతని నిర్ణయం ఆమెకు నచ్చలేదు. అలాని భర్తని కాదనలేదు.

"చూస్తూ చూస్తూ ఒక తురకవాడికి కూతుర్ని కట్టబెడుతున్నామా?" అని వాపోయింది.

"తండ్రిగా నాకూ బాధుంది. కానీ గత్యంతరం లేదు. విజయనగర ప్రజలకోసమూ, అక్కడనుండి బయట పడడానికిదొక్కటే మార్గం కనిపించింది. విరూపాక్షుని దయవల్ల బ్రతికి బయట పడ్డాను. మన అమ్మాయికి నువ్వు నచ్చ చెప్పు. నేనూ నా మాటగా చెబుతాను," అంటూ జరిగినదంతా పూస గుచ్చినట్లు చెప్పాడు.

దేవరాయలు  సాయంత్రం కూతురు మంజరిని పిలిపించి విషయమంతా చెప్పాడు.

"ఈ తండ్రిని క్షమించు తల్లీ. విజయనగరం ప్రజలకోసం ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదు," అంటూ కూతుర్ని ప్రాధేయపడ్డాడు.

ఆమె ఏమీ మాట్లాడ లేదు. అప్పటికే ఆమెకు ఈ విషయం తెలుసు.

మంజరి మౌనం చూసి ఇంకేం చెప్పాలో తెలియలేదు దేవరాయలకి.

"మీ ఇష్టం" అనేసి వెళ్ళడానికి లేచింది మంజరి. కూతురు కళ్ళలో కన్నీళ్ళు గమనించాడు దేవరాయలు.

వెళుతూ వెళుతూ ఆమే అంది – "విజయనగర ప్రజల కోసం నేను ఈ పెళ్ళికి ఒప్పుకున్నాను తప్ప మీ మాట మీద గౌరవంతో మాత్రం కాదు. మీరు మీ శత్రువుకి నన్ను కానుకగా ఇస్తున్నారు. చూస్తూ చూస్తూ ఒక అగ్ని గుండంలోకి నెట్టేస్తున్నారు నన్ను. చావు దీనికంటే ఎక్కువ ఆనందం ఇస్తుంది తండ్రీ! మీరిచ్చిన మాటని నిలబెడతాను. కానీ మిమ్మల్ని మాత్రం క్షమించను. దయచేసి మీరు నాతో మాట్లడడానికి సాహసించకండి..." అంటూ రోదిస్తూ వెళిపోయింది.

కూతురు వెళ్ళిన వైపే చూస్తూ ఉండి పోయాడు దేవరాయలు.

తను తప్పు చేసానని తనకి తెలుసు. తన రాజకీయానికి కూతుర్నే బలిపశువు చేసాడతను. విజయనగర ప్రజలూ, త్యాగమూ వంటి పెద్ద పెద్ద మాటలు ఆమె జీవితాన్ని బలి తీసుకోబోతున్నాయి.

రాజ్యాధికారం కోసం తోబుట్టిన వాళ్ళనే బలితీసుకున్న వ్యక్తికి కూతురూ, కొడుకూ వంటి విలువలు వుంటాయనుకోవడం పెద్ద భ్రమ. రాజకీయం రెండు వైపులా పదునున్న దుర్మార్గమైన ఆయుధం. దానికి ఒక్కోసారి సొంత వాళ్ళే బలవుతారు. అందుకు మంజరే ప్రత్యక్ష సాక్ష్యం.

కూతురు ఒప్పుకున్నా, కాదన్నా ఇది జరిగి తీరుతుందనీ దేవరాయలకీ తెలుసు. కూతురి దగ్గర అమాయకంగా నటించాడు. అంతే!

0000000

(కొనసాగింపు వచ్చేసంచికలో)

Click here to share your comments on this serial